క్లుప్తంగా

14న అప్రెంటిస్ మేళా

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ఈ నెల14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్‌ల విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

సమస్యలపై నిరంతర పోరాటం

ప్రకాశం నగర్: బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. స్థానిక అపరాల సెక్షన్ కార్యాలయంలో గురువారం పార్టీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధు మాట్లాడుతూ నగరంలోని 50 వార్డుల్లో ఆయా ప్రజాప్రతినిధులు లేక ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలి



కబేళాలో జనరేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వ్యాపారులు తమ వ్యాపారాలను అభివృద్ధికి చేసుకోవాలని కృషి చేయాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక ఆవరోడ్డులోని మేకలు, గొర్రెల కబేళా (ఆధునిక జంతువధశాల)ను గురువారం ఆయన సందర్శించారు. రూ.10 లక్షలతో ఆధునీకరించిన కబేళా, రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ జనరేటర్, రూ.3 లక్షలతో నిర్మించిన స్లాట్స్ కటింగ్ మెషీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రాజమండ్రి ముస్లిం మటన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, యాదవుల సంఘం అధ్యక్షుడు నక్కా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగులను ఆదరించాలి



ఆట వస్తువులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: మానసిక రోగులను అందరూ ఆదరించాలని లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో జనని మానసిక దివ్యాంగుల సంస్థలో కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు మద్దుల వీఎస్ శ్రీరామ గుప్తా మాట్లాడుతూ మానసిక రోగులను ఆదరించి, మనలో కలుపుకోవాలన్నారు. అనంతరం మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలకు ఆటవస్తువులు, పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వెన్నా కుమార్ స్వామి, క్లబ్ అడ్మిన్ గ్రంధి వసంత కుమారి, బుచ్చిరాజు, మాధవరావు పాల్గొన్నారు.

న్యాయం చేయండి సార్



గోపాలకృష్ణ సమస్యను తెలుసుకుంటున్న ఆర్‌డీవో కృష్ణ నాయక్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తనకు గతంలో కేటాయించిన రేషన్‌షాపును బైఫరికేషన్ కింద విభజించుచున్నట్లు తెలియసిందని, తనకు న్యాయం చేయాలని రాజానగరం మండలం జి.యర్రంపాలేనికి చెందిన దివ్యాంగుడు పెదపాటి గోపాలకృష్ణ అన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఆర్‌డీవో ఆర్.కృష్ణ నాయక్‌కు మొరపెట్టుకున్నారు. గురువారం సాయంత్రం ఆర్‌డీవో కార్యాలయానికి వచ్చిన గోపాలకృష్ణ వద్దకు ఆర్‌డీవో వెళ్లి సమస్య తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు.

సినిమాలు

శ్యామల	: వేట్టయన్
సూర్యమినీ	: జిగ్రా
సూర్యప్యాలెస్	: దేవర
స్వామి	: శ్వాగ్
అశోక	: దేవర
శివజ్యోతి	: విశ్వం
అనుశ్రీ	: శ్వాగ్
రాజా	: మార్టిన్
రంభ	: మా నాన్న సూపర్ హీరో
ఊర్వశి	: వేట్టయన్
మేనక	: సత్యం సుందరం, మార్టిన్
కుమారి	: దేవర
అప్సర నామవరం	: దేవర
విఎస్‌మహల్ ధవళేశ్వరం	: దేవర, వేట్టయన్
మురళీకృష్ణ కడియం	: దేవర
వెంకటసూర్య	: వేట్టయన్

న్యాయం జరిగేనా..

- డ్వాక్రా మహిళల సొమ్ము గల్లంతు
- విచారణకు వచ్చిన అధికారులు
- వారికి జనసేన నేత మార్గనిర్దేశం
- బాధితులను పట్టించుకోని వైనం



కడియపులంకలో బాధిత డ్వాక్రా మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ఆ పార్టీల నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అంతా మాఇష్టం అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా అనేక అక్రమాలకు తెరలేపారు. సదరు నాయకుల అక్రమాల కథలు ప్రతిరోజూ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కడియం మండలం కడియపులంక పంచాయతీ పరిధిలో చోటు చేసుకున్న ఘటన ప్రజలను ముక్కున వేలు వేసుకునేలా చేసింది. డ్వాక్రా సొమ్ములు గల్లంతు కావడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు గ్రామంలో విచారణ చేపడుతున్న అధికారుల బృందానికి జనసేన గ్రామపెద్ద దిశానిర్దేశం చేయడం అందరినీ అవాక్కయ్యేలా చేసింది. విచారణ ఎక్కడ చేయాలి, ఎలా చేయాలి, అక్కడ ఎవరెవరు ఉండాలి తదితర విషయాలను సదరు పెద్ద మనిషి మార్గనిర్దేశం చేస్తున్నాడు. దీంతో దీంతో విచారణ పారదర్శకంగా జరుగుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల విచారణ

సుమారు ఐదు నెలల క్రితం గ్రామంలోని 32 గ్రూపులకు సంబంధించి సుమారు 30 లక్షల రూపాయలు సొమ్ము బ్యాంకులకు చెల్లించకుండా యానిమేటర్లు మాయం చేసినట్లుగా డ్వాక్రా గ్రూపు సభ్యులు గుర్తించారు. దీంతో గ్రామంలో కొందరు నాయకుల సహకారంతో సంబంధిత బ్యాంకు, ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి తగిన స్పందన లేకపోవడంతో కలెక్టర్ పి.ప్రశాంతికి మొరపెట్టుకున్నారు. ఆమె ఆదేశాల మేరకు అధికారుల బృందం గ్రామంలో విచారణ చేపట్టింది. గతంలో ఒకసారి విచారణ చేసినప్పటికీ తుది నివేదికను మాత్రం ఇవ్వలేదు. దీంతో బాధితులు పదేపదే అధికారుల చుట్టూ తిరుగుతూ తమ గోడు వెళ్లబోసుకోవడంతో గురువారం రెండోసారి విచారణకు వచ్చారు. కడియపులంక సచివాలయంలో బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

జనసేన నేత హడావుడి

బాధితుల నుంచి వివరాలు సేకరిస్తుండగా అక్కడకు వచ్చిన ఒక జనసేన గ్రామపెద్ద.. ఏమీ లేనిదానికి ఎందుకింత హడావుడి అంటూ అధికారులపై కేకలు వేయడం మొదలు పెట్టాడు. అంతే కాకుండా అక్కడున్న కొందరు మీడియా ప్రతినిధులను సైతం మీకిక్కడేం పని అంటూ ప్రశ్నించడంతో వారంతా అవాక్కయ్యారు. ఇలా బహిరంగ విచారణ చేపట్ట వద్దు, కడియపులంకలో కాకుండా బుర్రిలంకలో విచారణ చేయండి, అందర్నీ అక్కడికి రానీయొద్దు అంటూ విచారణ బృందానికి మార్గనిర్దేశం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో అక్కడున్న అధికారులు, బాధిత మహిళలు, మీడియా ప్రతినిధులు ముక్కున వేలేసుకున్నారు. కనీసం మాజీ ప్రజాప్రతినిధి కూడా కానీ సదరు గ్రామపెద్ద ఇలా హుకుం జారీ చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. తమ కష్టార్జితం పోయింది మొర్రో అంటూ మొర పెట్టుకుంటే పట్టించుకోకుండా, విచారణ ఎలా జరగాలో చెప్పడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా జరగాలి

ఇదిలా ఉండగా 32 గ్రూపులకు సంబంధించిన పద్దులను పరిశీలిస్తే రూ.30 లక్షల గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మిగిలిన గ్రూపుల పద్దులను కూడా పరిశీలిస్తే ఈ అక్రమాలు మరిన్ని బయటపడతాయని బాధిత మహిళలు చెబుతున్నారు. అయితే డబ్బుల గోల్‌మాల్ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న కొందరు యానిమేటర్లు గ్రామ పెద్దలను ఆశ్రయించారు. దీంతో వారిని కాపాడేందుకు విచారణను పక్కదారి పట్టిస్తున్నట్లుగా బాధితులు అభిప్రాయ పడుతున్నారు. డబ్బులు పోగొట్టుకుని తాము ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతుంటే తమను పట్టించుకోకపోగా, విచారణ ఎలా చేయాలో? చెప్పడం చూస్తేనే పరిస్థితి అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి విచారణను పారదర్శకంగా జరిపించి, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నిరాశ్రయులకు అన్ని వసతులు కల్పించాలి



ర్యాలీలో పాల్గొన్న గుబ్బల రాంబాబు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని నిరాశ్రయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు కోరారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని గురువారం కంబాల చెరువు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులకు మరిన్ని సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. నగరంలో సుమారు 5 వేల మందికి పైబడి నిరాశ్రయులు ఉన్నారన్నారు. వివిధ పనులు, అవసరాలరీత్యా అనేక మంది నగరానికి వస్తున్నారన్నారు. అయితే సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక రోడ్డున పడుతున్నారన్నారు. ఇలాంటి వారి కోసం స్వర్ణాంధ్ర సంస్థ తరఫున ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం స్వర్ణాంధ్ర ఆధ్వర్యంలో నిరాశ్రయులకు అల్పాహారం, నూతన దుస్తులు, కాస్మొటిక్స్ అందజేశారు. నగర పాలక సంస్థ విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ ఎంవీఆర్ మూర్తి, పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నిరాశ్రయుల కేంద్రం నిర్వహిస్తున్నట్లు రాంబాబు తెలిపారు. సాధారణ పౌరులతో సమానంగా నిరాశ్రయులకు హక్కులు కల్పించాలని, మరిన్ని నిరాశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 200 మంది వృద్ధులు, మహిళలు, నిరాశ్రయులతో కలిసి నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు బల్లా శ్రీనివాసరావు, మహ్మద్ ఖాన్, డాక్టర్ పి.దేవానంద్, రమేష్, జానకి రామయ్య, చిన్ని, అనూప్ జైన్ పాల్గొన్నారు.

నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతం



సత్యదేవ నర్సరీలో ఎన్‌సీసీ కేడెట్లు

కడియం: మొక్కల పెంపకంలో కడియం ప్రాంత నర్సరీ రైతుల నైపుణ్యం అద్భుతమని, సరికొత్త రకాల మొక్కల ఉత్పత్తిలో వారికి వారే సాటి అని గుంటూరు రేంజ్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ మంజుశ్రీ అన్నారు. మూడు వందల మంది ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి గురువారం కడియపులంకలోని సత్యదేవ, శివాంజనేయ నర్సరీలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా నర్సరీల అధినేతలు పుల్లా పెద సత్యనారాయణ, మల్లు పోలరాజు ఘన స్వాగతం పలికారు. నర్సరీలలో మొక్కల ఉత్పత్తి విధానాలు, సంరక్షణ రీతులను ఎన్‌సీసీ కేడెట్లకు తెలిపారు.

వైద్యుల సూచనలతో త్వరిత ఉపశమనం

కంబాలచెరువు: వైద్యుల సూచనలు, సలహాలను పాటించడం ద్వారా రోగాల నుంచి త్వరగా కోలుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక చికిత్స, వన్ స్టాప్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ విభాగంలో చికిత్స పొందుతున్న వారి వివరాలు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని, తిరిగి కుటుంబ సభ్యులతో కలిపేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. ఆయన వెంట గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ, డాక్టర్ ఎస్.అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

ఫోర్ ప్రకాష్ మృతి తీరనిలోటు



ఫోర్ ప్రకాష్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్మిక నేత పిల్లా సూర్యప్రకాశరావు (ఫోర్ ప్రకాష్) మృతి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బొమ్మూరులోని ఫోర్ ప్రకాష్ స్వగృహం వద్ద గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రకాష్ చిత్రపటానికి జక్కంపూడి రాజా, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే రౌతుసూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫోర్ ప్రకాష్ కుమారుడు పిల్లా బాబీ, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైకిల్ యాత్ర



రాజమహేంద్రవరం చేరుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మనోజ్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: బెంగళూరు నుంచి సైకిల్‌పై సాహస యాత్రను చేపట్టిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మనోజ్ కుమార్ గురువారం రాజమహేంద్రవరం చేరుకున్నారు. సైకిల్‌పై దేశం మొత్తం చుట్టేయాలన్న లక్ష్యంతో అతడు ఈ యాత్రను ప్రారంభించారు. ఆయనకు సైకిల్ తొక్కడం చాలా ఇష్టం. దీంతో దీనిపైనే యాత్ర చేయాలని భావించారు. టూర్ దే ఇండియా సైకిల్ యాత్ర పేరుతో 6 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించాలనే లక్ష్యంతో సెప్టెంబర్ 28వ తేదీన సైకిల్ యాత్రను మొదలు పెట్టారు. బెంగళూరులో మొదలైన ఈ యాత్ర కృష్ణగిరి, చెన్నై, నెల్లూరు, నాయుడుపేట, ఒంగోలు, విజయవాడ మీదుగా 12వ రోజుకు వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుని గురువారం నాటికి రాజమహేంద్రవరం చేరుకుంది.

వెయ్యి కిలోమీటర్లు పూర్తి

కంబాలచెరువులోని దండి మార్చ్ విగ్రహాల వద్ద మనోజ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ తన లక్ష్యంలో కేవలం వెయ్యి కిలోమీటర్లు పూర్తయ్యిందన్నారు. మరో 5 వేల కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉందని తెలిపారు. గోల్డెన్ క్వాడ్రిలేటర్‌గా పిలుచుకునే కోల్‌కతా, చెన్నై, ముంబై, ఢిల్లీలలో పర్యటించాలన్నదే తన ఆశయమన్నారు. ఉత్తరాన ఢిల్లీ, తూర్పున కోల్‌కతా, పశ్చిమాన ముంబై, దక్షిణాన చెన్నై నగరాలను చుడితే దేశం మొత్తం చుట్టివచ్చినట్టేనన్నారు. అందుకే గోల్డెన్ క్వాడ్రిలేటర్ ప్రాంతాన్ని తిరగాలన్న లక్ష్యంతో సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ తన సైకిల్ యాత్ర కొనసాగిస్తానన్నారు. రాజమహేంద్రవరంలో తన బంధువుల ఇంట విశ్రాంతి తీసుకుని, శుక్రవారం ఉదయం తన ప్రయాణాన్ని కొనసాగిస్తానని తెలిపారు.

తక్కువ ధరకు వంటనూనెలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని వినియోగదారులకు తక్కువ ధరకే వంటనూనెలు అందించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ రైతుబజార్లలోని స్పెషల్ కౌంటర్లలో వంటనూనెల ధరలను తగ్గించి విక్రయించాలన్నారు. అన్ని హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలోని దుకాణాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు లాభాపేక్ష లేకుండా విక్రయాలు జరపాలన్నారు. ధరల నియంత్రణపై ఎప్పటికప్పుడు లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లయిస్, జీఎస్టీ, మార్కెటింగ్ శాఖల అధికారులు ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. అమ్మకాలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులు, బిల్లులను తనిఖీ అధికారులు కోరినప్పుడు చూపించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో ప్రసాదరావు, హోల్‌సేల్ అండ్ రిటైల్ ఆయిల్ వ్యాపారస్తులు, అధికారులు పాల్గొన్నారు.

విజయదశమి నుంచి అన్నప్రసాద వితరణ



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీటీఆర్ఐ: గౌతమ ఘాట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో విజయ దశమి నుంచి సంక్రాంతి వరకూ అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ ధర్మకర్త జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు నిర్మించిన అయ్యప్ప ఆలయాన్ని 2011 మార్చి 10వ తేదీన ప్రారంభించినట్టు గుర్తు చేశారు. ఆ ఏడాది నుంచి ఆయన సంకల్పంతో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు. అయ్యప్ప, భవాని, శివమాలలు ధరించిన భక్తులకు భోజనం అందిస్తామన్నారు. మాలధారణ చేసేవారికి శివాలయం ఇక్కడ లేదని తెలుసుకుని వాయులింగాన్ని ప్రతిష్ఠ చేశామని తెలిపారు. మేధా దక్షిణామూర్తి, లక్ష్మీహయగ్రీవ, సువర్చలా ఆంజనేయ స్వామి విగ్రహాలు కూడా ఉన్నాయన్నారు. మన్యం ఎలక్ట్రికల్స్ కోరిక మేరకు వీరభద్రస్వామి ఆలయాన్ని కూడా నిర్మించుకోవడానికి ధర్మకర్తలు అంగీకారం తెలిపారన్నారు. చల్లా శంకరరావు మాట్లాడుతూ గతేడాది 1.40 లక్షల మందికి భోజనం అందించగా, ఈ ఏడాది కూడా అదే అంచనాకు చేరుకుంటామని తెలిపారు. దాతలు విరివిగా సహకారం అందిస్తున్నారని, 1.15 కోట్ల విరాళాలను డిపాజిట్ చేశామన్నారు. లక్ష్మీసాయినాథ్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత చాపరాల రామచంద్రరావు పేరిట ఆయన కుటుంబ సభ్యులు రూ.65 వేల విరాళం అందజేశారన్నారు.

నర్సరీలతో రతన్ టాటాకు అనుబంధం



రతన్ టాటాతో మార్గాని శేషు (ఫైల్)

కడియం: కడియం ప్రాంతంలోని పలు నర్సరీలతో రతన్ టాటాకు అనుబంధం ఉందని, ఆయన ఇల్లు, కార్యాలయాలకు ఈ ప్రాంతం నుంచి అనేక రకాల మొక్కలు పంపించడం జరిగిందని యువ నర్సరీ రైతు మార్గాని శేషు అన్నారు. ఇటీవలే కుటుంబంతో సహా పలు మార్లు రతన్‌ను ఆయన కలిశారు. మొక్కలు, జంతువులపై రతన్ టాటాకు ఉన్న ప్రేమను స్థానిక విలేకరులకు తెలిపారు. రతన్ టాటాను కుటుంబంతో సహా కలిసేందుకు చేసిన ప్రయత్నాల్లో భాగంగా ఆయన అపాయింట్‌మెంట్ లభించిందన్నారు. విమానం ఆలస్యం కావడంతో గంటన్నర తరువాత కూడా ఆయన్ను కలిసేందుకు అవకాశం ఇచ్చి, ఆప్యాయంగా మాట్లాడారని శేషు గుర్తు చేసుకున్నారు.

హరి తాడోజు చిత్ర నివాళి



హరి తాడోజు గీసిన చిత్రం

రాజమహేంద్రవరం సిటీ: వ్యాపార దిగ్గజం రతన్ భారతీయుల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయులుగా నిలిచి ఉంటారని ప్రముఖ చిత్రకారుడు హరి తాడోజు అన్నారు. జాతీయ జెండాతో భరతమాత ఒడిలో సేద తీరుతున్నట్టుగా రతన్ టాటా చిత్రాన్ని గీసి నివాళులర్పించారు.

దుర్గాదేవిగా జగన్మాత



మోరంపూడి సాయినగర్‌లో దుర్గాదేవి అలంకరణ



బాలాజీపేట సెంటర్‌లో విజయ కనకదుర్గాదేవి



ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో..



వాసవీమాతకు ఖర్జూరాలతో అలంకరణ



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



దేవీచౌక్‌లో బాలాత్రిపుర సుందరీదేవి



చిట్టి గాజులు, వట్టివేర్ల అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



దుర్గామాతగా కాశీ అన్నపూర్ణాదేవి

సీటీఆర్ఐ: దేవీచౌక్‌లో బాలాత్రిపుర సుందరీదేవిని గురువారం దుర్గామాతగా అలంకరించారు. గాడాలలోని మహాలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి పీఠంలో అమ్మవారిని చిట్టి గాజులు, వట్టివేర్ల దండలతో అలంకరించారు. పీఠాధిపతి చిన్న వెంకన్నబాబుస్వామీజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఉమామార్కండేయస్వామి దేవాలయంలో పార్వతి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. బలరామపేటలోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కాశీ అన్నపూర్ణాదేవిని దుర్గామాతగా అలంకరించారు. శంకరమఠం, ఉమా రామలింగేశ్వరస్వామి, సారంగధరేశ్వరస్వామి ఆలయాలు, సరస్వతీఘాట్‌లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిని ఖర్జూరాలతో అలంకరించారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని గురువారం దుర్గాదేవిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో పూజలు నిర్వహించారు. బాలాజీపేటలోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, వాసంశెట్టి సూర్యగణేష్, తలారి శ్రీనివాసరావు, సూరంపూడి ప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి వెంకటగిరి వివేకానంద వీధిలో వివేకానంద యూత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దుర్గాష్టమి సందర్భంగా దుర్గామాతగా అమ్మవారు దర్శనమిచ్చారు. దేవాలయ ప్రాంగణంలో జరిగిన లక్ష కుంకుమార్చనలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కాగా.. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో బొప్పన సుబ్బారావు, దాసరి శివ, ఈరంకి రఘుభూషణ్, మల్లాది సుబ్రహ్మణ్యం, బొప్పన రామకృష్ణ, వివేకానంద యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.